క్లుప్తంగా

ఘనంగా రామానుజ తిరునక్షత్ర పూజలు



పూజలందుకున్న రామానుజులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కోదండరామాలయంలో భగవత్ రామానుజుల వారి తిరునక్షత్ర ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో రామానుజుల విగ్రహానికి పంచామృత, క్షీరాభిషేకాలు, శోడశోపచార పూజ, తీర్థ గోష్టి నిర్వహించగా.. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

మోడల్ పోలింగ్ స్టేషన్‌గా రామచంద్రాపురం



రామచంద్రాపురం పోలింగ్ కేంద్రం వద్ద స్వాగత ద్వారం

గార: మండలంలోని 75 పోలింగ్ కేంద్రాలుండగా, వాటిలో రామచంద్రాపురం పంచాయతీ 8వ నంబరు పోలింగ్ స్టేషన్‌ను మోడల్ కేంద్రంగా ఎలక్షన్ కమిషన్ ప్రకటించింది. ఈ మేరకు కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కేంద్రం వద్ద స్వాగత ద్వారం ఏర్పాటుతో పాటు మామిడి తోరణాలు, ప్రత్యేక షామియానాలు, ఓటర్లు క్యూలైను వద్ద మ్యాట్‌లు, పీఓ నుంచి అన్ని టేబుల్లు వద్ద కార్పొరేట్ తరహాలో ఏర్పాట్లు చేశారు. ముందుగా సెల్ఫీ విత్ ఓటరు ఏర్పాటు చేయడంతో పాటు అవగాహన బోర్డు సిద్ధం చేశారు. పండగ వాతావరణంలో ఎన్నికలు ఉండాలన్న ఉద్దేశంతో సుందరంగా ఉంచామని ఎన్నికల అధికారులు తెలిపారు.

ప్రగతి పథంలో.. శ్రీకాకుళం



అభివృద్ధి చేసిన 80 అడుగుల రోడ్డు

శ్రీకాకుళం నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో స్పష్టమైన మార్పు కనిపించింది. స్వాగత ద్వారాల నుంచి శ్మశాన వాటికల వరకు, కార్పొరేషన్ నుంచి పంచాయతీల వరకు, సచివాలయాల నుంచి సమీకృత కలెక్టరేట్ వరకు, పెద్ద బజారు నుంచి పెద్దాస్పత్రి వరకు.. అన్నింటా అభివృద్ధి జరిగింది. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ధర్మాన ప్రసాదరావు మార్కు అభివృద్ధికి శ్రీకాకుళం ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది. ఓ వైపు వైఎస్ జగన్ సర్కారు సంక్షేమాలతో సామాన్యుడిని ఆదుకుంటే.. మరోవైపు ధర్మాన స్థానిక సమస్యలు పరిష్కరిస్తూ తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించారు.



రిమ్స్ వైద్యకళాశాల ఆవరణలో నిర్మించిన అదనపు భవనం

- మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన
- రూ.70 కోట్ల ఖర్చుతో రిమ్స్ ఆస్పత్రి వైద్య కళాశాల అభివృద్ధి
- రూ.313.57 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా రూ.1,207 కోట్లు లబ్ధి

శ్రీకాకుళం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ పాలనలో శ్రీకాకుళం నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోయింది. కార్పొరేషన్‌లోనే కాకుండా శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో సైతం కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు నిరంతరం నిర్వహించారు. రోడ్లు, ప్రభుత్వ భవనాలు, ఆస్పత్రులంటూ ప్రతి ఊరికీ సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిచ్చారు. దీనికి తోడు రూ.రూ.1,207 కోట్ల మేర సంక్షేమ పథకాల ద్వారా సామాన్యులకు సాయం అందింది.

ఆస్పత్రులకు పునరుజ్జీవం..

వైఎస్సార్ జిల్లా కేంద్రంలో రిమ్స్‌ను ఏర్పాటు చేసిన తర్వాత దాని గురించి అంతగా పట్టించుకున్నది వైఎస్ జగన్ ప్రభుత్వం మాత్రమే. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక రూ.70కోట్లతో అదనపు భవనాలు, ఎంఆర్ఐ, సీఆర్మ్, ఏఆర్మ్ వంటి అధునాతన యంత్రాలను సమకూర్చారు. శ్రీకాకుళం నగరంలో ఐదు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలకు రూ.4.19 కోట్లు మంజూరు చేశారు. గార, శ్రీకాకుళం రూరల్ మండలాల్లో ఏడు వెల్‌నెస్ కేంద్రాలుకు రూ.1.76 కోట్లు మంజూరు చేశారు.

అద్భుతంగా కలెక్టరేట్

అప్పట్లో వైఎస్సార్ జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి రూ.100 కోట్లు వరకు మంజూరు చేయగా ఆ తర్వాతి ప్రభుత్వాలన్నీ నిర్లక్ష్యం వహించాయి. వైఎస్ జగన్ కలెక్టరేట్ నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.40కోట్లు మంజూరు చేయటంతో పనులు ముగింపు దశకు చేరుకున్నాయి.

కొత్త భవనాలు

నియోజకవర్గంలో రూ.3.9 కోట్లతో 34 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. రూ.23 కోట్లలో 95 సచివాలయాలు ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీలకు సంబంధించి పాత్రునివలసలో 2765 ఇళ్లు, రాగోలులో 1764, సింగుపురంలో 1311 ఇళ్లు మంజూరయ్యాయి. చాలా మంది గృహప్రవేశాలు కూడా చేశారు. చల్లపేటలో రూ.50 లక్షలతో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.

సరికొత్తగా దారులు

- శ్రీకాకుళం నగరంలో రూ.25.92 కోట్లు వెచ్చించి 30.55 కిలోమీటర్ల దూరం సిమ్మెంటు రోడ్లు నిర్మించారు.
- గార, శ్రీకాకుళం రూరల్ మండలాల్లో రూ.8 కోట్ల ఖర్చుతో 10 కిలోమీటర్ల సిమ్మెంటు రోడ్లను నిర్మించారు.
- రూ.6.80 కోట్లు ఖర్చుతో 8.5 కిలోమీటర్లు తారు రోడ్లను శ్రీకాకుళంలోను, రూ.2.8 కోట్లు ఖర్చుతో గార, శ్రీకాకుళం రూరల్ మండలాల్లో తారు రోడ్లు వేశారు.
- శ్రీకాకుళంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్ రూపురేఖలు మార్చారు.
- రూ.2.85 కోట్ల ఖర్చుతో పార్కులను అభివృద్ధి చేశారు.
- సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు రూ.కోటి నిధులు ఖర్చు చేశారు.
- నగరంలోని డేఅండ్‌నైట్ జంక్షన్ సమీపంలో అత్యాధునిక శ్మశాన వాటికను రూ.1.47 కోట్లతో నిర్మించారు. ఇందులో దహన సంస్కారాలు పూర్తి చేసేందుకు గ్యాస్, విద్యుత్ ఆధారిత యంత్రాలను ఏర్పాటు చేశారు.



కొర్ని గ్రామ సచివాలయ భవనం

సమగ్రంగా.. సమర్థంగా

వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో ఎచ్చెర్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోయింది. సువిశాల సముద్ర తీరం..అందుకు అనుగుణంగా ఫిషింగ్ హార్బర్ నిర్మాణం. అత్యున్నత విద్యా సంస్థలు.. వాటిని బలోపేతం చేస్తూ వందల కోట్లతో ఆధునికీకరణ. మారుమూల గ్రామాలు.. అక్కడ మౌలిక వసతుల పెంపు కోసం సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు. అతిపెద్ద పారిశ్రామిక వాడ.. స్థానికులకు ఉద్యోగాలు లభించేలా చర్యలు. నియోజకవర్గం నలుచెరగులా సంక్షేమ సంతకాలు కనిపించేలా వైఎస్ జగన్ ప్రభుత్వం పనిచేసి చూపించింది.

- ఎచ్చెర్ల నలుదిశలా అభివృద్ధి పనులు
- విద్యా సంస్థల ఆధునికీకరణకు పెద్దపీట
- బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు
- రూ.882 కోట్లతో నియోజకవర్గవ్యాప్తంగా అభివృద్ధి పనులు
- రూ.1578 కోట్ల మేర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి



నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన పాతర్లపల్లి ప్రాథమిక పాఠశాల

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరుపమాన రీతిలో ప్రగతిని పరుగులు పెట్టించింది. 100 గ్రామ సచివాలయాల పరిధిలో అనేకానేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి చూపించింది. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నిరంతరం ప్రజల్లో ఉండి, ప్రజా సమస్యలు తెలుసుకొని సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చారు.

ఉన్నత చదువుల కోసం..

ప్రతిష్టాత్మక విద్యా సంస్థ రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎం పురం క్యాంపస్‌లో సివిల్ నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చారు. రూ.167 కోట్లతో భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అకడమిక్ బ్లాక్‌లు, హాస్టల్స్, ల్యాబ్‌లు, స్టాఫ్ క్వార్టర్ నిర్మాణాలకు ప్రాధాన్యమిచ్చారు. బీఆర్ఏయూలో రూ.16 కోట్లతో బాలుర వసతి గృహం నిర్మించారు. దీన్ని వర్చువల్‌గా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. రూ.34 కోట్లతో పరిపాలన భవనం నిర్మిస్తున్నారు. అంతర్గత రోడ్లను ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించారు. నాడు-నేడు ఫేజ్ 1, 2ల్లో పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించారు. నియోజకవర్గంలో 363 పాఠశాలలు ఉండగా, 252 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారు. రూ.85 కోట్లతో పాఠశాలలు అభివృద్ధి చేశారు.

ఫిషింగ్ హార్బర్‌కు శ్రీకారం..

మత్స్యకారుల వలసల నిర్మూలన లక్ష్యంగా బుడగుట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం నిర్మాణ పనులు జరగుతున్నాయి. రూ.365 కోట్లతో సాగరమాల ప్రాజెక్టు కింద, విశ్వసముద్ర కాంట్రాక్టు సంస్థ ఈ నిర్మాణం చేపడుతోంది. పూర్తయితే మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.



ఆర్‌జీయూకేటీలో నిర్మాణంలో భవనాలు



బుడగుట్లపాలెం తీరం

కొత్త ఇళ్లు.. కొంగొత్త రోడ్లు..

- నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 113 జగనన్న కాలనీ లేఅవుట్లు వేశారు. 3484 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. మరో పక్క సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి 7214 మందికి మంజూరు చేశారు. రూ. 161 కోట్లు వరకు పేద ప్రజలకు లబ్ధి చేకూరింది.
- రణస్థలం మండలం జీరు పాలేం నుంచి జాతీయ రహదారి వరకు రూ. 8 కోట్లతో తారు రోడ్డు నిర్మించారు. పొన్నాడ నుంచి బొంతల కోడూరు వరకు రూ. 5 కోట్లతో తారు రోడ్డు వేశారు. రూ.25 కోట్లతో నియోజకవర్గంలో తారురోడ్లు వేశారు. మండల పరిషత్ నిధులు, ఏఆర్ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో రోడ్లు వేశారు.
- నియోజకవర్గ వ్యాప్తంగా రూ.130 కోట్లతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్ మిల్క్ కలెక్షన్ సెంటర్లు నిర్మించారు.



రూ. ఐదు కోట్లతో నిర్మించిన బొంతలకోడూరు తారురోడ్డు

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



ఎచ్చెర్ల క్యాంపస్: పీవోలకు ఈవీఎంలు అందజేస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్/రణస్థలం/జి.సిగడాం/ఎచ్చెర్ల: ఎచ్చెర్ల నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం ఏడు గంటలు నుంచి సాయంత్రం ఆరు గంటలు వరకు ప్రశాంత వాతావరణం ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. 309 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. జోనల్ అధికారులను నియమించి రూట్ల వారీగా వాహనాల్లో ఈవీఎంలు తరలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకొని టెంట్లు ఏర్పాటు చేశారు.



ఎచ్చెర్ల క్యాంపస్: డ్యూటీ ఎలాట్ మెంట్లు పరిశీలిస్తున్న సిబ్బంది



రణస్థలం: జే.ఆర్.పురం పోలింగ్ కేంద్రంలో బేబి కేర్ సెంటర్



రణస్థలం: జె.ఆర్.పురం మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రం లోపల



ఎచ్చెర్ల: మురపాక పోలింగ్ స్టేషన్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు



జి.సిగడాం: పోలింగ్ కేంద్రానికి చేరిన ఎన్నికల సామగ్రి

ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పని చేయండి

నరసన్నపేట: నరసన్నపేట నియోజకవర్గంలో సోమవారం జరగనున్న ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యేలా చూడాలని పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్నికల బందోబస్తు నిర్వహించనున్న పోలీసు సిబ్బందితో ఆమె ఆదివారం ఉదయం సమావేశమై పలు సూచనలు చేశారు. ఒక్కో రూట్‌లో ఒక్కో స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాన్ని నియమించామని వీరు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో నిత్యం తిరుగుతుంటారని అన్నారు. అలాగే ప్రత్యేక పారామిలటరీ బలగాలు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, ఆర్మడు ఫోర్స్ బలగాలతో పాటు లోకల్ పోలీసులు ఉంటారని అన్నారు. పోలింగ్ ముగిసి ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే వరకూ పోలీసు సిబ్బంది బాధ్యతగా ఉండాలన్నారు. ఎవరూ రాజకీయ పార్టీలకు కొమ్ము కాయవద్దని ఆదేశించారు. అలాగే నరసన్నపేట సీఐ, ఎస్ఐలకు ప్రత్యేక సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ జి.ఆర్.రాధిక



ఘనంగా శంకరాచార్యుల జయంతి

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధి ఉమారుద్ర కోటేశ్వర స్వామి దేవాలయంలో శంకరాచార్యుల విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి సహస్ర నామార్చనలు చేశారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ, ఈఓ సుకన్య పాల్గొన్నారు. ఉపనిషన్మందిరంలో శంకరాచార్యుల జయంతి వేడుకలు నిర్వహించారు.

సొంతింటి కల సాకారం



లింగాలవలస లే అవుట్

జిల్లాలో 834 లేఅవుట్లలో కాలనీల నిర్మాణం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో కాలనీలే కాదు ఏకంగా ఊళ్లు నిర్మించారు. జిల్లాలో అర్హులైన వారందరికీ జగనన్న ఇళ్ల స్థలాల కోసం 1795.80 ఎకరాలు అవసరం కాగా 1227.17 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించగా, మిగతా 568.63 ఎకరాల మేరకు ప్రైవేటు భూమి కొనుగోలు చేశారు. ఒక్క భూమి కొనుగోలు కోసమే రూ.178.31కోట్లు వెచ్చించారు. అర్హులైన వారందరి కోసం జిల్లాలో 1156 లేఅవుట్లు వేశారు. లే అవుట్ కోసం భూములు చదును చేయడం, జంగిల్ క్లియరెన్స్, అంతర్గత రోడ్లు, హద్దుల రాళ్లు, డ్రైనేజీ తదితర వాటి కోసం రూ.30కోట్లు ఖర్చు పెట్టింది. జగనన్న హౌసింగ్ కాలనీల్లో తాగునీటి సౌకర్యం కోసం 1632 పనులకు గాను రూ.143.05 కోట్లు మేర ఖర్చు చేస్తున్నారు. 801 లేఅవుట్లలో 50,100 ప్లాట్లకు ఎలక్ట్రిఫికేషన్ చేసే లక్ష్యంలో భాగంగా 269 లేఅవుట్లలో 25,126 ప్లాట్లకు ఎలక్ట్రిఫికేషన్ పూర్తయింది. మరో 472 లేఅవుట్లలో 37,807 ప్లాట్లకు ఎలక్ట్రిఫికేషన్ చేస్తున్నారు. వేసిన లేఅవుట్లలో పచ్చదనం కోసం కోట్ల రూపాయల ఖర్చుతో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. జిల్లా వ్యాప్తంగా 1156 లే అవుట్‌లు వేసినప్పటికీ 834 అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుంది. వీటిలో 38,773 స్థలాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు మంజూరు ఇచ్చింది. 37,067 ఇళ్లకు సంబంధించి ఆన్‌లైన్ జరిగింది.



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో..

వీటితో పాటు సొంత స్థలం ఉన్న వారి కోసం మరో 35,128 ఇళ్లు మంజూరు చేశారు. దీంతో లబ్ధిదారులు ఉత్సాహంగా ఇళ్లు నిర్మాణాలు చేపడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే అటు కాలనీల్లోనూ, ఇటు సొంత స్థలం ఉన్న చోట 30వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

తొలిసారి ఓటేస్తున్నారా..?



శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల సమరం వచ్చేసింది. ఈ సారి తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకునే వారికి కాస్త అయోమయం ఉంటుంది. తొలిసారి ఓటేస్తే ఏమేం చేయాలో తెలుసుకుందాం..

- ఓటరు చీటీ, ఐడీ కార్డుతో పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించాక, మొదట పోలింగ్ అధికారి-1 వద్దకు వెళ్లాలి. ఓటరు వివరాలను ఆ అధికారి తన వద్ద ఉన్న ఓటర్ల లిస్ట్‌తో పరిశీలిస్తారు. ఓటరు పేరు, జాబితాలో వరుస సంఖ్యను బిగ్గరగా చదువుతారు. ఆ కేంద్రంలో పార్టీల వారీగా ఉన్న పోలింగ్ ఏజెంట్లు ఆ ఓటరు పేరు, నంబరును తమ వద్ద ఉన్న ఓటరు లిస్టులో సరిచూసుకుంటారు.
- అనంతరం పోలింగ్ అధికారి-2 వద్దకు ఓటరు వెళ్లాలి. అతని వద్ద ఉన్న స్లిప్‌లోని వివరాలను ఆ అధికారి తన వద్ద ఉన్న రిజిస్టర్‌లో సరిచూసుకుని, సంతకం తీసుకుంటారు. ఒకవేళ ఓటరు నిరక్షరాస్యులైతే వేలిముద్ర తీసుకుంటారు. ఎడమ చేతి చూపుడు వేలిపై సిరా గుర్తు పెడతారు.
- అక్కడి నుంచి ఓటరు పోలింగ్ అధికారి-3 వద్దకు వెళ్లాలి. ఆ అధికారి ఓటరు వద్ద ఉన్న చీటీని పరిశీలిస్తారు. తన వద్ద ఉన్న కంట్రోల్ యూనిట్‌లో మీట నొక్కి, ఓటును విడుదల చేస్తారు. (ఓటు రిలీజ్ చేయకముందు కంట్రోల్ యూనిట్‌పై ఎడమవైపు ఆకుపచ్చ రంగు ఎల్ ఈడీ బల్బు వెలుగుతూ ఉంటుంది. ఓటు రిలీజ్ చేశాక కుడివైపు రెడ్ లైట్ వెలుగుతుంది. దీన్ని ఓటరు చూడవచ్చు.)
- ఆ తర్వాత బ్యాలెట్ యూనిట్ వద్దకు ఓటరు వెళ్లాలి. ఈ యూనిట్ పైభాగంలో ఆకుపచ్చని ఎల్‌ఈడీ బల్బు వెలుగుతూ ఉంటుంది. బ్యాలెట్ యూనిట్‌పై అతికించిన బ్యాలెట్ కాగితంపై తాను ఓటేయాలని నిర్ణయించుకున్న అభ్యర్థి పేరు పక్కనే ఉన్న మీటను నొక్కాల్సి ఉంటుంది. మీటను నొక్కగానే, దాని పక్కనే ఉన్న బాణం గుర్తులో రెడ్ కలర్ లైటు వెలుగుతుంది. బీప్ సౌండ్ వస్తుంది. బ్యాలెట్ యూనిట్‌పై ఉన్న గ్రీన్ కలర్ లైటు ఆరిపోతుంది. బ్యాలెట్ యూనిట్‌పై సమీపంలోనే ఉన్న వీవీ ప్యాట్ యంత్రంలో ఒక స్లిప్ కనిపిస్తుంది.
- అందులో ఓటరు ఓటు వేసిన పార్టీ సింబల్, అభ్యర్థి పేరు కనిపిస్తాయి. ఈ చీటీ ఏడు క్షణాల పాటు కనిపిస్తుంది. ఆ తర్వాత డబ్బాలో పడిపోతుంది. దాన్ని పరిశీలించి ఓటు సరిగ్గా పడిందా, లేదా అన్నది నిర్ధారించుకోవచ్చు.



జి.సిగడాం: పెంటలో పోలింగ్ కేంద్రం

పోలింగ్ కేంద్రాలే అభివృద్ధికి సాక్ష్యాలు



2019లో టెక్కలి మండలం బొప్పాయిపురం పోలింగ్ కేంద్రం



నాడు-నేడు

ప్రస్తుతం సర్వాంగ సుందరంగా అన్ని రకాల వసతులతో ఉన్న బొప్పాయిపురం పోలింగ్ కేంద్రం

అరసవల్లి: మరికొద్ది క్షణాల్లో పోలింగ్ మొదలుకానుంది. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు తమ పరిధిలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు వేసేందుకు సమాయత్తమవుతున్నారు. అయితే ఈ పోలింగ్ కేంద్రాలు ఈ సారి సరికొత్తగా కనిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన నాడు-నేడు ఫలితమిది. ఒకప్పుడు అదే ఊరిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు కూలిపోయే పరిస్థితుల్లో ఉంటే.. అవే ఇప్పుడు నాడు-నేడు పథకంతో అత్యద్భుతంగా కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తయారయ్యాయి. ఇప్పుడు ఇలా సుందరంగా తయారైన నాడు-నేడు పాఠశాలలకే నేడు ఓటర్లంతా స్వయంగా వెళ్లి ఓట్లు వేయనున్నారు. తమ ఊరి పిల్లల చదువుల దేవాలయాలు ఎంత అభివృద్ధి చెందాయో.. కళ్లారా చూడనున్నారు. జిల్లాలో రెండు దశల్లో మొత్తం రూ.715 కోట్లతో మొత్తం 2,343 ప్రాథమిక/ఉన్నత పాఠశాలలు/జూనియర్ కళాశాలలను పూర్తిగా ఆధునీకీకరణ చేసి అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే.

ఎండలకు తట్టుకునేలా ఏర్పాట్లు: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోలింగ్ కేంద్రాల వద్ద ఎండలకు తట్టుకునేలా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ చెప్పారు. జిల్లాలోని 2,358 పోలింగ్ స్టేషన్లలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల ఓటర్లకు తగినట్టుగా ఏర్పాట్లు చేశామన్నారు. దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు, ప్రత్యేక క్యూలు, రవాణా సౌకర్యం కోసం వాహనాలు, సీనియర్ సిటిజన్లు, విజువల్, లోకోమోటివ్ వైకల్యాలు ఉన్న వ్యక్తులు, బలహీనమైన కదలికతో బాధపడుతున్న ఓటర్లకు సహాయం చేయడానికి ఎన్‌సీసీ/ఎన్ఎస్ఎస్ సహాయకులను అన్ని పోలింగ్ స్టేషన్లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్‌స్టేషన్ల వద్ద టెంట్లు, ఫ్యాన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య బృందాలు, పారా మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎండల్లో మహిళా ఓటర్లు తమతో పాటు పిల్లలను పోలింగ్ స్టేషన్లకు తీసుకురావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కమిషన్ ఆమోదించిన ఏదైనా గుర్తింపు కార్డుతో పాటు సంబంధిత పోలింగ్ స్టేషన్‌కు ఓటు వేయాలని సూచించారు.

కష్టాలు తీర్చిన రేషన్ బండి



ఒకప్పుడు రేషన్ తీసుకోవాలంటే ఆ రోజు పనులన్నీ మానుకుని రేషన్ దుకాణం ముందు నిరీక్షించాల్సి వచ్చేది. సాంకేతిక కారణాల వల్ల రెండు మూడు రోజులు ఆలస్యమయ్యేవి. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎం అయ్యాక ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాలతో ఈ అవస్థలన్నీ మటుమాయమైపోయాయి. ఇంటి వద్దనే రేషన్ బియ్యం అందుతోంది. ఈ పథకం ద్వారా ఒక వైపు లబ్ధిదారుల చెంతకే రేషన్ అందడంతో పాటు సుమారు 844 మంది నిరుద్యోగ యువతకు ఎండీయూ వాహనాల ద్వారా ఉపాధి లభించింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 422 ఎండీయూ వాహనాలతో ప్రతీ నెల 6,74,871 రైస్ కార్డుల్లో ఉన్న సుమారు 19,88,491 సభ్యులకు రేషన్ సరుకులు అందజేస్తున్నారు. ఈ వ్యవస్థ వల్ల ప్రతి నెలా ఇంటి వద్దకే రేషన్ అందుతోందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - టెక్కలి

వీధి బడుల పిల్లల కోసం



'జగనన్న విద్యా కానుక'తో సీఎం వైఎస్ జగన్ వేలాది నిరుపేద కుటుంబాలకు భారం తగ్గించారు. అంతే కాదు పిల్లల్లో ప్రభుత్వ బడుల పట్ల ఉండే చిన్న చూపును పోగొట్టారు. పాఠశాలలు, విద్యాలయాలు, రెసిడెన్షియల్ స్కూల్స్, వసతి గృహాలు ఇలా.. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుకను అందించారు. పిల్లల చేతిలో కొత్త పుస్తకాలు పెట్టి, వేసుకోవడానికి మూడు జతల యూనిఫారాలు ఇచ్చి దానికి బెల్టు, సాక్సులను తోడుగా జోడించి, అవి పెట్టుకోవడానికి బ్యాగు సమకూరుస్తున్నారు. జిల్లాలో నాలుగేళ్లలో 9,87,692 (9.88లక్షల)మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక(జేవీకే) కిట్లను రాష్ట్రప్రభుత్వం అందజేసింది. ఇందుకోసం రూ. 198.09 కోట్ల నిధులను ఖర్చు చేసింది. జేవీకే కిట్‌లో స్కూల్ బ్యాగుతోపాటు మూడు జతల చొప్పున యూనిఫాం క్లాత్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బూట్లు, 2 జతల సాక్సులు, బెల్టు, వర్క్‌బుక్స్, డిక్షనరీ ఇలా 9 వస్తువులు ఉంటాయి. -శ్రీకాకుళం న్యూకాలనీ

ఆహా ఏమి రుచి..



జగనన్న గోరుముద్ద.. పిల్లల పాలిట ఆరోగ్య ప్రదాయినిగా మారింది. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినడం ఇంటే ఇంటికి వెళ్లి తినడం మేలని పిల్లలు అనుకునేవారు. కానీ ఇప్పుడు జిల్లాలో వందశాతం మంది విద్యార్థులు బడిలోనే భోజనం చేస్తున్నారు. కిచిడీ, ఫ్రైడ్ రైస్, పులిహోర వంటి వాటితో పాటు కోడిగుడ్లు, చిక్కీలు మెనూలో చేర్చారు. దీంతో గతంలో బడిలో మధ్యాహ్న భోజనం తినడం మానేసిన విద్యార్థులు సైతం ఇప్పుడు ఎంతో ఇష్టంగా తింటున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రైమరీ 1907, అప్పర్ ప్రైమరీ 332, హైస్కూళ్లు 333 కలిపి మొత్తం 2572 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 1,83,545 మందికిగాను జగనన్న గోరుముద్దను 1,83,313 మంది తింటున్నారు. - శ్రీకాకుళం న్యూ కాలనీ

అన్నదాతకు తోడు



అన్నదాతను అప్పుల బారి నుంచి కాపాడుతూ ప్రభుత్వం రైతు భరోసాను అమలు చేస్తోంది. ఎవరి వద్దా అప్పు చేయకుండా పంట పండించే మార్గం దొరికింది. వైఎస్సార్ రైతు భరోసా పథకంతో ప్రభుత్వం చేసిన మేలు ఇది. డాక్టర్ వైఎస్సార్ రైతుభరోసా-పీఎం కిసాన్ కింద 14.89లక్షల కుటుంబాలకు గాను రూ.1919.46కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. వాస్తవానికి ఎన్నికల హామీ ల్లో భాగంగా నాలుగేళ్ల పాటు ఈ సాయం అందిస్తామని అప్పట్లో వైఎస్ జగన్ ప్రకటించారు. కానీ ఐదో ఏడాది కూడా అందించి తన సహృదయతను చాటుకున్నారు. ప్రతి రైతు కుటుంబానికి పెట్టుబడి ఆర్థిక సాయం కింద ప్రభుత్వం ఐదేళ్లలో రూ.67,500 అందించింది. ఈ పథకం కింద ఏటా కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా చెల్లించే రూ.6000లతో పాటు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.7500లు కలిపి ప్రతి రైతు కుటుంబానికి రూ. 13500 అందజేస్తున్నారు. సొంతభూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వమే రూ.13500 ఆర్థిక సాయం చేస్తోంది. - శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

నేతన్నకు చేయూత



వైఎస్సార్ నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ.24వేలు, నెలకు రూ.3వేలు పింఛన్, చేనేత క్లస్టర్ ఏర్పాటు.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేనేత కుటుంబాలకు అందించిన సాయమిది. పాదయాత్రలో చేనేతల కష్టాలు కళ్లారా చూసి, వారి బాధలను అర్థం చేసుకుని నేతన్న నేస్తం పథకానికి ఆయన రూపకల్పన చేశారు. అధికారంలోకి వచ్చాక ఏటా ఓ తేదీ చెప్పి అదే తారీఖున రూ. 24వేలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. జిల్లాలో నేతన్న నేస్తం కింద ఐదేళ్ల పాటు దాదాపు రూ.15.34 కోట్లు ఖాతాల్లో జమ చేశారు. 3,812 మంది చేనేత కార్మికులకు రూ.3 వేలు చొప్పున పింఛన్లు అందజేస్తున్నారు. నేషనల్ హ్యాండ్లూం డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కాంపొనెంట్‌లో ఏర్పాటు చేసిన మూడు క్లస్టర్లకు రూ. 2.97 కోట్లు అందజేశారు. - పొందూరు

గిరిపుత్రులకు రక్షణ



ఫీడర్ అంబులెన్స్

గిరిజన ప్రాంతాల్లో ఫీడర్ అంబులెన్స్ సేవలు అపురూపంగా సాగుతున్నాయి. మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, పాతపట్నం మండలాల్లోని 372 గిరిజన గ్రామాలకు ఫీడర్ అంబులెన్స్ సేవలు అందుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల ప్రజలను సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఫీడర్ అంబులెన్స్‌లు అందుబాటులో ఉండేలా చేయడంలో సక్సెస్ అయ్యారు. పేరుకు ఇది ఫీడర్ అంబులెన్స్ అయినా దీంట్లో ఆక్సిజన్ కిట్, నెబ్యులైజేషన్ పరికరం, పల్స్ ఆక్సీమీటర్, బీపీ చెకర్, అత్యవసర సమయాల్లో అందించాల్సిన మందులు అన్నీ అందుబాటులో ఉంటాయి. - మెళియాపుట్టి

ఆమదాలవలసలో.. నిధుల వరద

- నియోజకవర్గంలో రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల లబ్ధి రూ.1830.66 కోట్లు



ఆమదాలవలస/ఆమదాలవలస రూరల్: రాజకీయంగా అత్యంత ప్రభావశీలవంతమైన ప్రాంతంగా గుర్తింపు పొందిన ఆమదాలవలస నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గడిచిన 57 ఏళ్లలో ఎన్నడూ చూడని అభివృద్ధిని వైఎస్ జగన్ సర్కారు హయాంలో చూస్తున్నామని ప్రజలు చెబుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఐదేళ్ల కాలంలో రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. రూ.1830.66 కోట్లతో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరింది.

పనులివే..

- రైతు కోసం జిల్లాలోనే మొదటిసారిగా ఆమదాలవలస పట్టణంలో రూ.1.35 కోట్లతో బయోలాజికల్ ల్యాబ్, నియోజకవర్గ స్థాయిలో రూ.1.50 కోట్లతో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు.
- గాజుల కొల్లివలస గ్రామ సమీపంలో జగనన్న కాలనీ లేవుట్‌లో రూ.1.60 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేశారు. దాదాపు 20 గ్రామాలకు రెండు మెగావాట్ల విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారు. వ్యవసాయ కనెక్షన్లకు నిరంతరంగా విద్యుత్‌ను అందించేందుకు ఇది దోహదపడుతోంది.
- నియోజకవర్గంలో రూ.39.50 కోట్లు ఖర్చు చేసి రోడ్లను అభివృద్ధి చేసింది.
- పొందూరు మండలం లైదాం వద్ద రూ.6 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు.
- ఆమదాలవలస మున్సిపాలిటీలో 27 వార్డులకు గాను రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలు చేపట్టారు. దీనికోసం రూ.2.84 కోట్లు ఖర్చు చేశారు.
- ఆమదాలవలస మున్సిపాలిటీ అభివృద్ధిపై సర్కారు ప్రత్యేక దృష్టిపెట్టింది. 'సీ' గ్రేడ్ నుంచి 'బి' గ్రేడ్‌గా అప్‌గ్రేడ్ చేసింది.
- పట్టణంలో రూ.64 కోట్లతో వివిధ ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్లు వేశారు.
- నియోజకవర్గ వాసుల దాహార్తి తీరేలా రూ.158 కోట్ల వ్యయంతో ప్రతి ఇంటికీ తాగునీరు అందించారు
- జగనన్న కాలనీల కోసం 78 లేవుట్‌లను గుర్తించి 3420 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. 5354 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయడంతో రూ.158 కోట్లు అందజేశారు.

పాతపట్నంకు కొత్త కళ

- నియోజకవర్గంలో రూ.824.74 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల లబ్ధి రూ.739.29 కోట్లు



ఎల్.ఎన్ పేట : అంతెత్తున ఉండే కొండలపైకి దారి వచ్చింది. మైదానంలోని పల్లెలకు నీరు వచ్చింది. ప్రాజెక్టుకు భూములిచ్చిన వారికి న్యాయం జరిగింది. పోడు సాగు చేసుకునే గిరిజనానికి సాయం అందింది. పల్లెపల్లెనా శాశ్వత భవనాలు నిర్మితమయ్యాయి. పాతపట్నంలో కొత్త కళ కనిపిస్తోంది.

పనులివే..

- రూ.828.74 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాలతో రూ.739.28 కోట్ల లబ్ధి
- సుమారు 26 కోట్లతో రహదారుల ఏర్పాటు
- ఐదు మండలాల్లో నాడు-నేడు పనుల ద్వారా 246 ప్రభుత్వ పాఠశాలలను రూ.46.38 కోట్లతో అభివృద్ధి చేశారు.
- వంశధార నీరు స్థానికంగా ఉపయోగపడేలా రూ.265 కోట్లు ఖర్చుతో ఐదు మండలాలకు తాగునీరు అందించే పనులకు శంకుస్థాపన చేశారు.
- రూ.700 కోట్లు ఖర్చుతో ఉద్దానం ప్రాంతానికి వంశధార తాగునీరు అందించే ప్రాజెక్టు పనులు హిరమండలం వంశధార రిజర్వాయర్ వద్దనే పూర్తి చేశారు.
- రూ.176.35 కోట్లు ఖర్చుతో హిరమండలం మండలంలోని వంశధార రిజర్వాయర్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపడుతున్నారు.
- వంశధార నిర్వాసితులకు రూ.216.71 కోట్ల అదనపు పరిహారం అందజేశారు.
- రూ.6 కోట్లు ఖర్చుతో కొత్తూరులో 132/33 కేవీ సామర్థ్యం గల సబ్‌స్టేషన్ నిర్మించారు.
- మెళియాపుట్టి మండలంలో రూ.12 కోట్లు ఖర్చుతో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం.
- పాతపట్నం మేజర్ పంచాయతీలో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రూ.93 లక్షల ఖర్చుతో కొత్తగా 15 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.



టెక్కలిలో ప్రగతి వెన్నెల

- రూ.4,361.91 కోట్లతో శరవేగంగా మూలపేట పోర్టు నిర్మాణం
- టెక్కలి ఆస్పత్రి ఆధునికీకరణ
- సంక్షేమ పథకాల ద్వారా రూ.1555.84 కోట్ల మేర లబ్ధి



టెక్కలి: టెక్కలి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్నిరంగాల్లో అభివృద్ధి చెందింది. సుమారు రూ.4361.91 కోట్లతో సంతబొమ్మాళి మండలం మూలపేటలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. టెక్కలిలో గత టీడీపీ హయాంలో కాసుల కక్కుర్తితో 200 పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. ఆ ఆస్పత్రిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేసి ప్రజలకు అంకితమిచ్చింది. టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల్లో సంక్షేమ పథకాల రూపంలో సుమారు రూ.1555.841 కోట్లను అర్హులకు అందజేశారు. రూ.7 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. సుమారు రూ.4,361.91 కోట్లతో పోర్టు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మూలపేట, విష్ణుచక్రం గ్రామాల నిర్వాసితులకు నౌపడలో రూ.11 కోట్లతో 55 ఎకరాల్లో పునరావాస కాలనీ నిర్మాణ పనులు చేపడుతున్నారు.

పనులివే..

- నియోజకవర్గంలో దాదాపు 6875 మందికి రూ. 98.93 కోట్ల రూపాయలు వెచ్చించి ఇళ్ల స్థలాలు అందజేశారు. చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి.
- రైతులకు మేలు చేసేలా నందిగాం మండలం బడబంద గ్రామం వద్ద జిల్లాలోని 45వేల మంది రైతులకు మేలు చేసేలా 15వేల క్వింటాళ్ల నిల్వ సామర్థ్యం కలిగిన కేంద్రం నిర్మించారు.
- మండలంలో లింగాలవలస పంచాయతీలో సుమారు రూ. 2 కోట్ల 30 లక్షలతో కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం తలపెట్టారు.
- టెక్కలిలో రూ.84 లక్షలతో వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.
- నందిగాం మండలం నుంచి పూండీ వెళ్లేందుకు వీలుగా నరేంద్రపురం పంచాయతీ నారాయణపురం వద్ద వంశధార ప్రధాన కాలువపై వంతెన ఏర్పాటుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.1.58 కోట్లు మంజూరు చేసింది. దీంతో రెండు మండలాల మధ్య రాకపోకలకు మార్గం దొరికింది.

నరసన్నపేటలో ప్రగతి పరుగులు

- సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.1475 కోట్ల మేర లబ్ధి
- రూ.431 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు



నరసన్నపేట: నరసన్నపేట గతంలో ఎన్నడూ చూడని రీతిలో ప్రగతి పనులకు సాక్షిగా నిలిచింది. నరసన్నపేటలో 80 అడుగుల మేర రోడ్డు వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయడంతో నరసన్నపేట పట్టణం రూపురేఖలు మారాయి. రూ.1475 కోట్లు పలు సంక్షేమ పథకాల రూపంలో లబ్ధిదారుల ఖాతాలకు జమయ్యాయి. మరో రూ. 431 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు.

పనులివే..

- నరసన్నపేటలో కమ్యూనిటీ ఆస్పత్రిని ఏరియా ఆస్పత్రిగా మార్చారు.
- రూ. 12.50 కోట్లతో ఆస్పత్రికి నూతన భవనాలు నిర్మించారు.
- మాకివలస, ఉర్లాం, పోలాకి, గుప్పడిపేట, జలుమూరు, సైరిగాం, అచ్చుతాపురం, సారవకోటల్లో పీహెచ్‌సీలను అభివృద్ధి చేశారు.
- నాలుగు మండలాల్లో జగనన్న 102 లేఅవుట్లు వేశారు. వీటి అభివృద్ధికి రూ. 25 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది.
- రూ.1.80 కోట్లతో నరసన్నపేటలో రోడ్లు భవనాల శాఖ అతిథి గృహాన్ని బాగు చేశారు.
- పంచాయతీ రాజ్ విభాగంలో రూ.24 కోట్లతో 50 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మించారు. జమ్ము నుంచి నవతల వరకూ పర్లాకిమిడి రోడ్డు ఎస్‌హెచ్‌గా మారి రూ. 150 కోట్లతో అభివృద్ధికి నోచుకుంది.
- అలాగే జర్జంగి-పిండ్రువాడ రోడ్డు రూ.36 కోట్లతో, కోమర్తి-బద్రి రూ.25 కోట్లతో, లుకలాం-కొమనాపల్లి రోడ్డు రూ.10 కోట్లతో బాగు చేశారు. నరసన్నపేట టౌన్‌లో రోడ్డు విస్తరణ, సెంటర్ లైటింగ్ రూ. 4.50 కోట్లతో చేపట్టారు.
- నియోజకవర్గంలో కొవిరిపేట, బుచ్చిపేట, కామేశ్వరిపేట వీటితోపాటు మొత్తం 50 కిలోమీటర్ల మేర రోడ్లు రూ. 15 కోట్లతో అభివృద్ధికి నోచుకున్నాయి.
- పిన్నింటిపేట నుంచి అంబీరుపెంట వరకూ జెడ్పీ నిధులు రూ. 2.3 కోట్లుతో రోడ్డు వేశారు.
- నరసన్నపేట, జలుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను రూ. 2.25 కోట్లతో బాగు చేశారు. నరసన్నపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందింది.